క్లుప్తంగా

కోర్టుకు వాటర్ కూలర్ వితరణ



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): సీనియర్ అడ్వకేట్ ఇసుకపల్లె గురుమూర్తయ్య జ్ఞాపకార్థం ఆయన శిష్యుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోళ్ల జయకృష్ణ గురువారం కోర్టుకు వాటర్ కూలర్‌ను వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా వాటర్ కూలర్‌ను ప్రిన్సిపల్ మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు ప్రారంభించారు. జడ్జి మాట్లాడుతూ కోర్టు ఆవరణలో కక్షిదారులకు మంచినీటి సౌకర్యాన్ని బార్ అసోసియేషన్ ద్వారా ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జడ్జీలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, బార్ ఉపాధ్యక్షుడు బొల్లెద్దుల రవి, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, నందం బాబురావు, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ముస్లిం రచయితల సంఘం కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న అబ్దుల్ సమద్

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా ముస్లిం రచయితల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికను స్థానిక చాంద్‌బాడలోని కార్యాలయంలో గురువారం రచయిత షేక్ అబ్దుల్‌సమద్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధ్యక్షుడిగా ఎండీ రఫీ, ఉపాధ్యక్షులుగా ఎండీ కరీముద్దీన్, అబ్దుల్ అజాద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్‌బాషా, కార్యదర్శి రఫీ, కోశాధికారి ఫయాజ్, కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ వాహబ్, అయూబ్‌ఖాన్, అబ్దుల్‌అలీమ్‌తో పాటు ఆరుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరి పదవీ కాలం రెండేళ్ల పాటు కొనసాగుతుందన్నారు.

అంకాలమ్మ చెంచుగూడెంలో సదుపాయాలు కల్పించండి



ఐటీడీఏ ఏపీఓ సురేష్‌కుమార్ వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

శ్రీశైలంప్రాజెక్ట్: నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని ఆలమూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంకాలమ్మ చెంచుగూడెంలో మౌలిక వసతులు కల్పించాలని గిరిజనులు కోరారు. గురువారం ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గిరిజనులు ఐటీడీఏ ఏపీఓ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గూడెంలో సరైన నీటి సౌకర్యం, రోడ్లు, విద్యుత్‌సరఫరా లేవని చెప్పారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కే జునైద్ బాష, గూడెం వాసులు రవణమ్మ, సుంకమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీ నరసింహులు కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కేజీబీవీలలో వార్డెన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. తెలుగు పదోన్నతుల సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో కృష్ణారావు, విజయరావు, జగదీష్, శ్రీమౌళిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సికిందర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ గురువారం తెలిపారు. ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉయ్యాలవాడ: మండలంలోని రూపనగుడి గ్రామ సమీపంలో కుందూనది వంతెన మలుపు వద్ద గురువారం ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన తెలుగు రమణయ్య పెద్దముడియం మండలం పాలూరు గ్రామంలో బంధువులను కలిసి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న తరుణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కాలు, తలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. గ్రామ సర్పంచ్ దేశం సోమశేఖర్‌రెడ్డి 108 వాహనానికి ఫోన్ చేసి, కోవెలకుంట్ల ఆసుపత్రికి తరలించారు.



ఆళ్లగడ్డలో లలితాదేవి అలంకరణలో వాసవీమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి





పండ్ల అలంకారంలో నంద్యాల శ్రీకాళికాంబదేవి

బిల్వవృక్ష వాహినిగా శ్రీవాసవీ మాత





బాలాజీ కల్యాణ మండపంలో మహాచండీగా

సంజీవనగర్ రామాలయంలో శ్రీ మహాలక్ష్మి

మహిమ చూపవమ్మా ..మహాలక్ష్మీ



అహోబిలంలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

లలితాదేవిగా వాసవీమాత

ఆళ్లగడ్డ : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీమాత లలితాదేవిగా భక్తులకు అభయమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీమత్కన్యకా పరమేశ్వరీ దేవీ అమ్మవారు లలితాదేవీ అలంకరణలో భక్తులను కనువిందు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు అందుకుంటున్న శ్రీ వాసవీమాతా అమ్మవారిని గురువారం రాత్రి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చేరుకున్న ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశి ఆశీర్వచనాలు అందజేశారు.

దొర్నిపాడు: నవరాత్రుల్లో భాగంగా కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు శ్రీలలితాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం వసంతోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని 5వ రోజైన గురువారం పలు దేవాలయాల్లో పూజలు, హోమాలు నిర్వహంచారు. సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించి ప్రత్యేక మండపాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు.

- పట్టణలోని బ్రహ్మనందీశ్వరస్వామికి ఉదయన్నే మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పార్వతీదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. శ్రీమహానందీశ్వర కామేశ్వరి సహిత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించారు. సాయంత్రం అమ్మవారిని అన్నపూర్ణ, కాత్యాయిదేవిలుగా అలంకరించారు. అనంతరం శ్రీకామేశ్వరదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.
- శ్రీకాళికాంబదేవస్థానంలో అమ్మవారిని మధర మీనాక్షి అలంకారంలో అలంకరించారు. ఉదయం కూష్మాండదేవి అలంకారం, సాయంత్రం ప్రత్యేక మండపాల్లో అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మండపంలో ఉత్సవమూర్తికి శ్రీబిల్వ వృక్ష వాసినిదేవిగా అలంకరించారు.
- స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీకశెట్టి సుబ్బమ్మ కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు ఉదయమే పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి లలితా సహస్ర నామ పారాయాణం నిర్వహించారు. అనంతరం చండీ యాగం నిర్వహించారు. అమ్మవారిని మహా చండీ అలంకారంలో అలంకరించారు.
- కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో 5వ రోజు అమ్మవారిని అన్నపూర్ణదేవి అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
- స్థానిక సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామికి ఉదయం సుప్రభాతసేవలు, పంచామృతాభిషేకాలు, ఉత్సవ మూర్తులకు తిరుమంజన సేవలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో అలంకరించారు. శివాలయంలోని కాశీవిశ్వనాథునికి, కాశీవిశాలాక్షి అమ్మవారిని ప్రత్యేక మండపంలో మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
- స్థానిక తెలుగుపేటలోని శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో దుర్గాదేవి విగ్రహాన్ని నెలకొల్పి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి కాత్యాయినిదేవిగా అలంకరించారు.
- స్థానిక జగజ్జననీ నగర్‌లోని శ్రీజగజ్జననీ దేవాలయంలో నవరాత్రుల్లో భాగంగా ఐదవరోజు అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక రాహుః కాల పూజలు నిర్వహించి మహామంగళ హారతులు నిర్వహించారు.
- స్థానిక కల్పనా సెంటర్‌లోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కలశస్థాపన, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలో అలంకరించారు.
- బాల్కొండ హాల్ వీధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహానికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొమ్మలసత్రం షిర్డిసాయి దేవాలయంలో అమ్మవారి విగ్రహానికి అన్నపూర్ణదేవి అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. రెవెన్యూ క్వార్టర్స్ సంతాన మహాలక్ష్మీ అలంకారంలో, ఎన్‌జీఓ కాలనీలో రామాలయంలోని శ్రీలలితాదేవి అలంకారంలో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం దేవస్థానంలో తోట ఉత్సవం బిల్వవృక్ష నివాసిని శ్రీపార్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు.

ఉయ్యాలవాడ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లలితా త్రిపురా సుందరి దేవిగా చౌడేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

రుద్రవరం:స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో గురువారం అమ్మవారు గౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

■ వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం దిగువ అహోబిలంలో కొలువైన మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను కొలువుంచి నవకళస్థాపన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించి అనంతరం ఉత్సవ మూర్తులను అద్దాల మండపంలో కొలువుంచి ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామున్

నంద్యాల: ప్రతి పౌరుడు ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి ఏపీ సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, ప్రాధాన్యత భవనాలు, గృహ నిర్మాణాలు, గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే, బాల్యవివాహాల నివారణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్లోడ్ చేసుకునేలా వలంటీర్ల ద్వారా విస్తత ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో రెఫరల్ కేసులకు సంబంధించిన పేషంట్లను ఏఎన్ఎంల ద్వారా ఆరోగ్య మిత్ర సిబ్బందికి అప్పగించేలా చూడాలని సూచించారు. కంటి వెలుగు కింద అవసరమైన పేషెంట్ల ఆపరేషన్లకు సంబంధించి 45 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా వ్యాధి ప్రబలకుండా దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు, పంచాయతీ సిబ్బంది నివారణ చర్యలు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ జఫ్రుల్లా, సీపీఓ వేణుగోపాల్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. సాగునీరిస్తాం



కేసీ కెనాల్ అధికారులతో మాట్లాడుతున్న మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటస్వామి

దొర్నిపాడు: ప్రస్తుతం సాగు చేసిన పంటలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగు నీరు అందిస్తామని కేసీ కెనాల్ డీఈ దశరథరామిరెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. వారం రోజులుగా 16వ లాక్ వరకు మాత్రమే సాగునీరు వస్తుండటంతో రామచంద్రాపురం గ్రామనికి చెందిన మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో రైతులు 24వ లాక్ వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడి చేరుకోని రైతులతో మాట్లాడారు. విడతల వారీగా సాగునీరు ఇవ్వాలని, 24 లాక్ వరకు నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సాగునీరు అందిస్తామని రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని హామీ ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఏఈ రమేష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రమణయ్య తదితరులు ఉన్నారు.

సాఫీగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దారు రవీంద్రప్రసాదు

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం సాఫీగా సాగింది. ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన ఎంపీడీఓ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు వరుసగా వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండలంలో 6 సబ్ స్టేషన్లు ఉన్నాయని రైతులకు నాణ్యమైన విద్యుత్ పగటి పూటే 9 గంటలు అందించేందుకు ప్రభుత్వం ఇటీవలే రుద్రవరం సబ్ స్టేషన్లో రూ.1.50కోట్లతో కొత్త పీటీఆర్ అమర్చామని ఏఈ రాఘవేంద్రా రెడ్డి, తెలిపారు. కోటకొండ వైపు లో ఓల్టేజీ సమస్య లేకుండా కొత్తగా సబ్ స్టేషన్ మంజూరు అయ్యిందని అయితే స్థల సమస్య ఉందని ఆ సమస్యను పరిష్కరించాలని తహసీల్దారుకు విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంఈఓ కోటయ్య, ఏడీ గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

చాగలమర్రి: మండలంలోని తోడేండ్లపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన చల్లా ఏసేబు (45)అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందాడు. అతని భార్య మార్థమ్మ, కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10,000ల నగదును గ్రామ సర్పంచ్ ఆర్.గోవిందయ్య, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అందజేశారు. మిగతా తొంభై వేల రూపాయలు మృతుడి భార్య బ్యాంకు ఖాతాలో త్వరలోనే జమా అవుతాయని ఎంపీడీఓ తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పింగళి సూరన శాఖా గ్రంథాలయానికి గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుమ్మల పుల్లయ్య పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను గ్రంథాలయ అధికారి శ్రీధర్‌కు అందజేశారు. విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే పత్రికలు, పుస్తకాలు గ్రంథాలయంలో పాటకులకు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాషా పండితులు అన్నెం శ్రీనివాసరెడ్డి, కొప్పుల ప్రసాద్, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

గోస్పాడు: స్పందన సమస్యలను ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని తహసీల్దార్ విజయశేఖర్, ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్పందనకు వచ్చే దరఖాస్తుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమస్యలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆయా శాఖల సిబ్బంది, అధికారులతో చర్చించి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. స్పందన ద్వారా ఏ శాఖకు వచ్చే దరఖాస్తుల సమస్యలు ఆ శాఖ అధికారులకు అందజేస్తారని, వాటి పరిష్కారం చేయాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. వీటి కోసం మండల స్థాయిలో ప్రతి నెల మొదటి వారంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీటీ రామచంద్రారావు, ఏపీఓ నాగజ్యోతి, సీనియర్ అసిస్టెంట్ రాము, ఏఎస్ఐ మద్దిలేటి, సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్

- గడప గడపకూ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): సంక్షేమ పథకాల రారాజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం నంద్యాల మండలం చాబోలు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం శిల్పా రవి మాట్లాడుతూ మాట్లాడుతూ గడప గడపకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందివ్వాలన్నదే జగనన్న ఆశయమన్నారు. పారదర్శకంగా, ఆదర్శంగా జగన్ పాలన కొనసాగుతుందన్నారు. సంక్షేమ అభివృద్ధి పథకాలను సంతృప్తి స్థాయిలో తమ గడప వద్దకే చేరవేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజానికం నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు. నాలుగేళ్లలో 99శాతం హామీలను నెరవేర్చి ప్రజల చెంతకు చేరుకోవడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. తెలుగుదేశం నాయకులు మోసపు మాటలతో మాయ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మౌనిక, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఎంపీటీసీ చెన్నయ్య, ఉప సర్పంచ్ హుసేన్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగనందిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మదార్‌సా, తిమోతి, బాలహుసేని, పాల మాబు, విశాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 30న సివిల్ రైట్స్ డే నిర్వహించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): జస్టిస్ డాక్టర్ పున్నయ్య సిఫార్సుల మేరకు ప్రతి నెలా 30న సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, రాజేశ్వరమ్మ అన్నారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో గురువారం డివిజన్ స్థాయి ఎస్సీ,ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీపీ ప్రభాకర్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వారానికి ఒక రోజు స్థానిక ఎస్ఐ గ్రామాన్ని సందర్శించాలని, ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు 48 జీవో ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని, హత్యకు గురైన ప్రాంతాన్ని తహసీల్దార్, డీఎస్పీ స్థాయి అధికారులు పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధానికి జాతీయ హెల్ప్‌లైన్ 14566 అమలు అయ్యేలా చూడాలన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు.

పేదల ఆరోగ్యానికి సురక్ష



నంద్యాల పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తోందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీ, హరిజనవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయన సందర్శించారు. అక్కడి వైద్య అధికారులతో మాట్లాడి అక్కడ ఏర్పాట్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. అందరికీ వైద్యం అందించాలి అనే సంకల్పంతో ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని చెప్పారు. హరిజనవాడ ఆరోగ్య కేంద్రంలో బైర్మల్ వీధి వాసులకు, ఎన్జీవో కాలనీ ఆరోగ్య కేంద్రంలో సాధిక్ నగర్ ప్రాంత వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్‌జీఓ కాలనీలో జరిగిన వైద్య శిబిరంలో 458 మందికి వైద్యం అందించామని వారిలో 22 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రెఫర్ చేశామని వైద్య అధికారి చంద్ర కాంత్ తెలిపారు. అలాగే హరిజనవాడ ఆరోగ్య కేంద్రంలో జరిగిన వైద్య శిబిరంలో 476 మందికి వైద్యం అందించామని వారిలో 7 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రెఫర్ చేశామని వైద్యాధికారి సభా బేగం తెలిపారు.

వైద్య శిబిరం విజయవంతం

ఉయ్యాలవాడ : మండలంలోని కొండపల్లె గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో వైద్యాధికారులు జనరల్ సర్జన్ ఎండీ లీలా ప్రసాద్, వైద్యాధికారులు శివకుమార్, శివలింగమ్మ, వెంకటసుబ్బయ్య, వైద్య బృందం 506 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 17 మందికి మెరుగైన చికిత్సల కోసం నంద్యాల, కర్నూలు, ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ వైద్యశాలలకు రెఫర్ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కాసాని పుణ్యలక్ష్మీదేవి, గ్రామ సర్పంచ్ ఇరిగెల లక్ష్మీపద్మజ, ఎంపీటీసీ సభ్యురాలు కపురం శివమ్మ, గ్రామ ఉప సర్పంచులు కందుల వెంకటసుబ్బారెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలించారు.

● పేదల ఆరోగ్యానికి భరోసా



గుండుపాపలలో కంటి అద్దాలను అందజేస్తున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం రాయమాల్పురం సచివాలయ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎంపీపీ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు షహలాం, గోపాల్, సంధ్యా, సుప్రియ, నారాయణరెడ్డి, ముఖేష్‌లతో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు 560మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, గ్రామ సర్పంచ్ పార్వతమ్మ, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూల బాషా, షేక్ మహబూబ్‌బాషా, ఎర్రహుసేని, వీరారెడ్డి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి



రాయమాల్పురంలో బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎంపీపీ ప్రభాకర్

దొర్నిపాడు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం వైద్యంపై ఎంతో దృష్టి పెట్టిందని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుండుపాపల గ్రామంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు విద్యాసాగర్, భార్గవి, రామచంద్ర, తేజశ్వనిలు 560 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణయ్య కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతలారెడ్డి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, సొసైటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జక్కుల రాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ కార్పొరేట్ వైద్య

చాగలమర్రి: ప్రజలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ గ్రామానా అమలు చేస్తున్నారని తోడేండ్లపల్లె సర్పంచ్ రామిశెట్టి గోవిందయ్య, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్ అన్నారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా, సచివాలయ కార్యదర్శి దాసుల ఆధ్వర్యంలో ముత్యాలపాడు సచివాలయం-2 ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో తోడేండ్లపల్లె, చక్రవర్తులపల్లె, ఎం.తండా గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వైద్యులు 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్య సేవల కోసం 15 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు సిఫారసు చేశారు. 35 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకాలరెడ్డి, లక్ష్మయ్య, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్యులు రాధికా జ్యోతి, అంజలి, ముఖ్య అతిథులు గర్భిణులతో సారెతో పాటు పండ్లు, సమీకృత పౌష్టికారాన్ని అందజేశారు.




కొండుపల్లెలో ఈసీజీ పరీక్షలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్



ముత్యాలపాడులో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

గుండె పరీక్షలు చేశారు



ఇంతకు ముందు గుండె, కంటి పరీక్షల కోసం కర్నూలుకు వెళ్లి చూపించుకున్నాను. రూ. 3 వేలకు పైగా ఖర్చయింది. ఈ రోజు మా సచివాలయంలో వైద్య శిబిరం పెట్టడంతో కండరాల నొప్పులకు, అన్ని రకాల జబ్బులకు ఈసీజీ పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. మాలాంటి వృద్ధులకు నివాసం వున్నచోటే వైద్య సేవలు లభించడం సంతోషంగా వుంది. సీఎం జగన్‌కు రుణపడి వుంటాం.

– పల్లె చిన్న ఈశ్వరరెడ్డి, ఆర్.పాంపల్లె